క్లుప్తంగా

గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు



మాట్లాడుతున్న తాలూకా సీఐ నల్లప్ప

ఆదోని రూరల్: గ్రామాల్లో ప్రజల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తాలూకా సీఐ నల్లప్ప, పెద్దతుంబళం ఎస్ఐ మహేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పెద్దతుంబళం పోలీస్టేషన్ ఆవరణలో గ్రామ ప్రజలతో సమావేశమయ్యారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాలు చేసేవారు భయపడతారన్నారు. దొంగతనాలు, దోపిడీలు చేసి పారిపోయిన వారి కదలికలను సీసీ కెమెరాల ద్వారా గుర్తించవచ్చని చెప్పారు.

పెద్దనేలటూర్‌లో డెంగీ కేసు నమోదు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గోనెగండ్ల : మండల పరిధిలోని పెద్దనేలటూర్ గ్రామంలో నాలుగేళ్ల బాలికకు డెంగీ వ్యాధి నిర్ధారణ అయినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ మణి మంజరి, ఈఓఆర్డీ అనంతసేన, వైద్య సిబ్బంది పెద్దనేలటూర్ గ్రామానికి వెళ్లి డెంగీ కేసు నమోదైన బాలిక ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉన్న నీటిని తొలగించి దోమల మందును పిచికారీ చేయించారు. అనంతరం గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించి గ్రామస్తులు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ శాంతమ్మ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న సీఐ గంగాధర్

గోనెగండ్ల : గ్రామాల్లో ఎవరైనా బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ గంగాధర్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గోనెగండ్లలో ప్రభుత్వ అనుమతి పొందిన మూడు మద్యం షాపులు ఉన్నాయన్నారు. ఈ మద్యం షాపులకు అనుబంధంగా మండలంలోని గ్రామాల్లో ఎవరైన బెల్టు షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా బెల్టు షాపులు నడుపుతున్నట్లయితే పోలీసులకు , ఎక్సైజ్ డిపార్‌మెంట్ సమాచారం తెలియజేయాలన్నారు.

పోలీసులకు ఉచిత వైద్య సేవలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మంత్రాలయం : మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో స్థానిక పోలీసులకు కర్నూలు నగరంలోని మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. సీఐ రామంజులు, ఎస్ఐలు పరమేష్‌నాయక్, విజయ్‌కుమార్, సిబ్బంది, మీడియా ప్రతినిధులు తదితరులకు షుగర్, బీపీ, ఈసీజీ వైద్య పరీక్షలు చేశారు. మెరుగైన వైద్యం అసరమైన వారికి ఉచితంగా వైద్య సర్వీసులు అందించబడునని వివరించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



4వ వార్డులో కమిషనర్‌తో మాట్లాడుతున్న ప్రజలు

ఆదోని టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ సూచించారు. శుక్రవారం కమిషనర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందితో కలిసి 4వ వార్డులో పర్యటించారు. వాల్మీకినగర్, శక్తిగుడి ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని శానిటరీ సెక్షన్ అధికారులకు సూచించారు. అనంతరం పురాతన చౌదరిబావిని పరిశీలించారు. బావిలోని నీటి గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. బావిలో రోజూ ఊట ద్వారా నీరు వస్తున్నాయని, ఆ నీటిని ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని స్థానిక ప్రజలు కమిషనర్‌ను కోరారు.

కూలేందుకు సిద్ధం!

- శిథిలావస్థకు చేరిన ఓహెచ్ఆర్ ట్యాంకులు
- పట్టించుకోని అధికారులు
- కనీసం మరమ్మతులకైనా నోచుకోని వైనం
- భయాందోళనలో ఆయా గ్రామాల ప్రజలు

గోనెగండ్ల : మండల పరిధిలోని ఆరు గ్రామాల్లో మంచినీటి ట్యాంకులు శిథిలావస్థకు చేరాయి. పెచ్చులూడి కడ్డీలు తేలడంతో ఎప్పుడు ఏప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అయినప్పటికీ వాటిని నిర్వహణ చూస్తున్న పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని, వాటి మరమ్మతు లు కూడా చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

6 ట్యాంకులు పూర్తి అధ్వానంగా..

మండలంలో 28 ఓహెచ్ఆర్ ట్యాంకులు ఉన్నాయి. అందులో ఆరు గ్రామాల నీటి ట్యాంకుల పరిస్థితి అధ్వానంగా మారింది. మండల పరిధిలోని బైలుప్పల, కున్నూరు, తిప్పనూరు, కులుమాల బీసీ కాలనీలోని ఓహెచ్ఆర్ మంచినీటి ట్యాంకులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బైలుప్పల గ్రామంలోని ట్యాంకును 30 ఏళ్ల క్రితం కట్టించారు. ఈ ట్యాంక్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. పిల్లర్స్ సైతం దెబ్బతిన్నాయి. నీటి ట్యాంక్ అడుగుభాగం సిమెంట్ పెచ్చులు ఊడిపోయి, ఇనుప కడ్డీలు తుప్పు పట్టిపోయాయి.





పెచ్చులూడిన ఓహెచ్ఆర్ పైకప్పు ట్యాంక్



బైలుప్పలలో శిథిలావస్థకు చేరుకున్న ఓహెచ్ఆర్ ట్యాంకు, ట్యాంకుకు కడ్డీలు తెలిన దృశ్యం

పిల్లర్ల సపోటర్స్ కూడా దెబ్బతిన్నాయి. ఎప్పుడు కూలుతుందోనని చుట్టూ పక్కన నివాసం ఉంటున్న ప్రజలు భయపడుతున్నారు. అధికారులు ట్యాంకును పరిశీలించి వెంటనే మరమ్మతు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కన్నూరు ట్యాంకు పూర్తి శిథిలం

తిప్పనూరు, బోదేపాడు, గ్రామాలలో ఉన్న ట్యాంకులు కూడా దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతుకు పంచాయతీ సిబ్బంది నిధులు కేటాయించాల్సి ఉంది. కన్నూరు గ్రామంలోని ఓహెచ్ఆర్ ట్యాంకు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో అధికారులు పరిశీలించి ట్యాంకును పూర్తిగా తొలగించాలని సూచించారు. కులమాల గ్రామంలోని బీసీ కాలనీలో ఉన్న ఓహెచ్ఆర్ ట్యాంకుల మరమ్మతులకు నిధులను విడుదల చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పెద్దనేలటూర్ గ్రామంలోని ట్యాంక్ ప్రమాద స్థాయికి చేరడంతో ట్యాంక్‌ను అధికారులే పడగొట్టారు.

త్వరలో ట్యాంకుల పనులు చేయిస్తాం



మండలంలోని 6 ఓహెచ్ఆర్ ట్యాంకుల పరిస్థితి బాగోలేదు. వాటి మరమ్మతులకు గాను గ్రామ పంచాయతీ అధికారులతో మాట్లాడి నిధులు కేటాయించి పనులు వెంటనే చేపడతాం. కన్నూరు ట్యాంకు పూర్తిగా తొలగించాల్సి ఉంది. పెద్దనేలటూర్ ట్యాంకును ఇప్పటికే తొలగించాము. ఆ స్థలంలో నీటి సంప్‌ను నిర్మిస్తాం.

– శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, గోనెగండ్ల

15లోపు ప్రీమియం చెల్లించండి

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని రైతులు డిసెంబర్ 15 లోపు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ప్రీమియంను చెల్లించాలని మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జొన్న పంట ఎకరాకు రూ. 297లు, టమాటకు ఎకరాకు రూ. 1500, వేరుశనగకు రూ. 480, పప్పుశనగ రూ. 420లు, ఉల్లికి రూ. 1350లు చెల్లించాలని తెలిపారు. ప్రీమియం చెల్లించే రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళ్లేటప్పుడు తమతో పాటు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ బుక్, మెబైల్ నెంబర్, వీపీఏ/వీహెచ్ఏ/వీఎస్ఏలు జారీ చేసిన క్రాప్ సర్టిఫికెట్, కౌలుదారుడైతే సీసీఆర్‌సీ కార్డులను తీసుకెళ్లి బీమా చెల్లించాలని చెప్పారు.

అపార్ నమోదు పకడ్బందీగా చేపట్టండి

కౌతాళం: అపార్ నమోదును పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ సుబ్బారాజు సూచించారు. అపార్ ఐడీ జనరేట్‌పై శుక్రవారం కౌతాళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓలు ఆంజనేయులు, శోభారాణి అధ్యక్షతన ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం వన్ నేషన్ వన్ స్టూడెంట్ కింద ప్రతి విద్యార్థికి 12 అంకెలు గల ఐడీ జనరేట్ చేయాలన్న లక్ష్యంతో ఉందన్నారు. దాని తగ్గట్టుగా ఉపాధ్యాయులు దీనిపై దృష్టి సారించాలన్నారు.

మైనర్లకు బైక్‌లు ఇస్తే కేసులు



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ శ్రీనివాసులు

ఎమ్మిగనూరురూరల్: తల్లిదండ్రులు మైనర్లకు మోటార్ బైక్‌లు ఇస్తే కేసులు నమోదు చేస్తామని పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి. శ్రీనివాసులు హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో వాహనాల తనిఖీని చేపట్టారు. సీఐ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వటం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రమాదాలు జరిగే బాధ్యత తల్లిదండ్రులు వహించాల్సి వస్తోందని చెప్పారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు, ఆర్సీ కలిగి ఉండాలని, మోటార్ బైక్‌కు నెంబర్ ప్లేట్ ఉండాలన్నారు. ఆటో డ్రైవర్లు నిబంధనలకు విరుద్ధంగా ఆటోలను ఎక్కడపడితే అక్కడ నిలబెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాహనాల తనిఖీ

ఆదోని అర్బన్: పట్టణంలోని ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం స్థానిక ఎన్‌టీఆర్ సర్కిల్ వద్దవాహనాలను తనిఖీ చేశారు. ట్రాఫిక్ నియమ, నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనదారుల దగ్గర ఉండాల్సిన వాహనాలకు సంబంధించిన రికార్డ్స్ పట్ల అవగాహన కల్పించారు. రికార్డులు సరిగా లేని వాహనదారులకు జరిమానాలు విధించారు.

కులధ్రువీకరణ పత్రం మంజూరుకు విచారణ



విచారణ చేస్తున్న జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిణి వెంకటలక్ష్మి

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని మారెమ్మ కొండ ప్రాంతాంలో కులధ్రువీకరణ పత్రం మంజూరుకై శుక్రవారం సాయంత్రం బీసీ వెల్ఫేర్ అధికారిణి వెంకటలక్ష్మి విచారణ జరిపారు. ఆమె మాట్లాడుతూ మోహతర్ కులం వారు (బీసీ-ఏ)సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోగా విచారణ చేసినట్లు చెప్పారు. ముస్లిం మైనార్టీల్లో మోహతర్ కులం తక్కువగా ఉందని, దీనిపై కాలనీలోని మైనార్టీ పెద్దలతో వివరాలు సేకరించినట్లు తెలిపారు. నివేదికను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. విచారణ అధికారిణితో పాటు తహసీల్దార్ శేషఫణి, ఆర్ఐ లక్ష్మన్న, వీఆర్వో షేక్షావలి తదితరులు ఉన్నారు.

పక్కా ఇళ్లకు దరఖాస్తు చేసుకోండి



హౌసింగ్ ఈఈ రవికుమార్

ఆదోని టౌన్: ఆదోని డివిజన్‌లో ప్రధానమంత్రి ఆవాజ్ యోజన-2.0 పథకం కింద పక్కా ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఆదోని హౌసింగ్ బోర్డు ఈఈ రవి కుమార్ లబ్ధిదారులను కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదోని పట్టణం, ఎమ్మిగనూరు పట్టణం, మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంతాల్లోని లబ్ధిదారులు పీఎంఏవై, కుడా పథకం కింద ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఆయా పథకాల కింద లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష మొత్తం రూ.2.50 లక్షలు ప్రభుత్వాలు ఆర్థిక సాయం అందజేస్తుందని చెప్పారు.

మోడల్ స్కూల్‌లో నాణ్యత లేని భోజనం



ఎంఈఓ నీలకంఠకు వినతిపత్రం అందజేస్తున్న స్కూల్ కమిటీ చైర్మన్ గౌస్, సభ్యులు

గోనెగండ్ల : స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో నాణ్యత, మెనూ ప్రకారం అందించకుండా విద్యార్థుల కడుపుకోడుతున్నారని స్కూల్ కమిటీ చైర్మన్ గౌస్ తెలిపారు. శుక్రవారం ఆయన కమిటీ సభ్యులతో కలిసి ఎంఈఓ-2 నీలకంఠకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులతో పాటు హాస్టల్‌లోని విద్యార్థులకు అందించే భోజనం కూడా నాణ్యత లేకుండా పెడుతున్నారని చెప్పారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే భోజనం సక్రమంగా అందించడం లేదని ఆరోపించారు. అలాగే పాఠశాలలో 6,7 తరగతులకు రెండేళ్ల నుంచి ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

విద్యార్థులకు పొంచివున్న ప్రమాదం



సోమలగూడూరులో ఎంపీపీ పాఠశాలలో పైకప్పులను పరిశీలిస్తున్న ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి

నందవరం : మండల పరిధిలోని సోమలగూడూరు గ్రామాంలోని ఎస్సీ కాలనీలో ఎంపీపీ స్కూల్ భవనం పైకప్పు పెచ్చులుడి పడే ప్రమాదంలో ఉందని ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం గ్రామంలోని పాఠశాలను ఎస్ఎస్ఏ ఏఈ శివశంకర్‌తో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..పాఠశాల పైకప్పు పెచ్చులుడి పడుతుందని, విద్యార్థులకు ప్రమాదం ఉందన్నారు. పైకప్పు భాగాన్ని మరమ్మతులు చేపట్టాలని ఎస్ఎస్ఏ ఏఈకి సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆందోళన చెందుతున్నారని, మరమ్మతులు త్వరగా చేపట్టాలన్నారు. ఎస్ఎస్ఏ ఏఈ మాట్లాడుతూ..మన బడి నాడు- నేడు నిధులు ఉన్నాయని, దాదాపు రూ.3 లక్షలు మర్మమ్మతులకు ఖర్చు అవుతందని అంచనా వేశామన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. అలాగే మిట్టసోమపురం గ్రామంలోని ఎంపీపీ పాఠశాలను ఎంఈఓ తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం, పాఠశాలలోని తాగునీరు, టాయిలెట్ల పరిశుభ్రతను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు సుబ్బారెడ్డి, రెహమాన్ పాల్గొన్నారు.

మాలల ఆత్మీయ సమ్మేళన సభకు తరలిరండి



మాట్లాడుతున్న మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సురేష్

ఆదోని రూరల్: ఈనెల 29న ఆదోని పట్టణంలోని జేబీ గార్డెన్‌లో నిర్వహించే మాలల ఆత్మీయ సమ్మేళన సభకు మాలలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సురేష్, తలారి ఆంజనేయులు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కుమారస్వామి అన్నారు. శుక్రవారం వారు స్థానిక కార్యాలయం వద్ద మాలల ఆత్మీయ సమ్మేళన సభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఈ ఆత్మీయ సమ్మేళన సభకు మేధావులు, చదువుకున్నవారు, రాజకీయ నాయకులు, ఉద్యోగస్తులు, వ్యాపారస్థులు ఇంటి దగ్గర ఉన్న ప్రతి ఒక్కరూ హాజరుకావాలన్నారు. మాలల హక్కుల సాధనకు పోరాడాల్సిన విధి విధానాలపై జాతీయ నాయకులు చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మరకట్టు కృష్ణ, సిద్ధు, గిరి తదితరులు పాల్గొన్నారు.

వలసలను నివారించండి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించి వలసలు నివారించాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య సాంకేతిక సహాయకులకు సూచించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పీడీని జిల్లా టెక్నికల్ అసిస్టెంటు అసోసియేషన్ ప్రతినిధులు ఆయన చాంబరులో మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే సమర్పించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ... టెక్నికల్ అసిస్టెంట్లకు పలు సూచనలు చేశారు. రానున్న రోజుల్లో ఉపాధి పనులకు డిమాండ్ ఎక్కువగా ఉంటుందని, అవసరమైన పనులు గుర్తించి సిద్ధంగా ఉండాలన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్ మాట్లాడుతూ.. జిల్లాలో టెక్నికల్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలను పీడీ దృష్టికి తెచ్చారు. అసోసియేషన్ నాయకులు బషీర్, వెంకటేష్, మహేష్, ఆనంద్, కేశవ, మల్లికార్జున తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్ ముట్టడికి పిలుపు

కర్నూలు(సెంట్రల్): రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 26వ తేదీన చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు పిలుపునిచ్చారు. శుక్రవారం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పలు కార్మిక సంఘాల నాయకులను కలిసి కార్మిక-రైతు ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు, రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. వెంటనే కనీస మద్దతు ధర చట్టాన్ని చేయాలన్నారు. 44 లేబర్ చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నాయకులు సీహెచ్ సాయిబాబా, నరసింహులు పాల్గొన్నారు.

పాఠ్యాంశాలు అర్థమయ్యేలా బోధించాలి



ఆస్పరి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈఓ శామ్యూల్ పాల్

ఆస్పరి: విద్యార్థినులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా బోధించాలని డీఈఓ శామ్యూల్ పాల్ ఉపాధ్యాయినులకు సూచించారు. శుక్రవారం స్థానిక కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థినులు, ఉపాధ్యాయినులతో మాట్లాడారు. 10వ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని చెప్పారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ఆస్పరి: మండలంలోని జొహరాపురం గ్రామ సమీపంలో శుక్రవారం పేకాట ఆడుతున్న ఐదు గురిని అరెస్టు చేసినట్లు సీఐ మస్తాన్‌వలి తెలిపారు. పేకాట ఆడుతున్నారనే సమాచం మేరకు పేకాట జొహరాపురంలో దాడి చేసి 7బైకులు, 5సెల్ ఫోన్లు, రూ. 22వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు.

ప్రిన్సిపాల్‌ను తొలగించాలి



డీఈఓ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎమ్మిగనూరు టౌన్: స్థానిక కేజీబీవీ ప్రిన్సిపాల్ కవితను తొలగించాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గతంలో అక్రమాలకు పాల్పడిన ప్రిన్సిపాల్‌కు మళ్లీ అదే పాఠశాలలో పోస్టింగ్ ఇవ్వడాన్ని నిరసిస్తూ డీఈఓ దిష్టి బొమ్మను విద్యార్థి సంఘాల నాయకులు దహనం చేశారు. ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మహేంద్రబాబు, కృష్ణ, వెంకటేష్, అఫ్రిదీ, నాగరాజు, రఘునాథ్ మాట్లాడుతూ విద్యార్థినుల ఆకలికేకలకు ప్రిన్సిపాల్ కారణమని విచారణలో తేలడంతో అధికారులు ఆమెను విధుల నుంచి తొలగించారన్నారు. అయితే మళ్లీ పోస్టింగ్ అదే పాఠశాలకు ఇవ్వడం ఎంత వరకు సమంజసమన్నారు. అందువలన ఆమె పోస్టింగ్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు సుబాన్, రవితేజ, మోహన్, కార్తీక్, చరణ్, బాష తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి అపార్ నమోదు చేయాలి



అపార్ నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ప్రతి విద్యార్థికి అపార్ నమోదు చేయాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన అపార్ నమోదు కేంద్రం, యూనియన్ బ్యాంకులో ఉన్న ఆధార్ నమోదు కేంద్రాన్ని తహసీల్దార్, ఎంఈఓలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు అపార్ నమోదు చేయడంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా చేపట్టాలన్నారు. మండలంలో రిజెక్షన్ (ఫెయిల్డ్) 7,104 దరఖాస్తులు ఉన్నాయన్నారు. రిజెక్షన్‌లో పేరు, వయస్సు, జెండర్ తప్పులను ఉన్న వాటిని ఉపాధ్యాయులు, గ్రామంలో ఉండే పంచాయతీ కార్యదర్శితో నివృతి చేసుకుని సరి చేయాలన్నారు. ఆధార్ అప్‌డేషన్ సంబంధించి ముందుగా స్కూల్‌ను మ్యాపింగ్ చేసుకోవాలన్నారు.

మంత్రాలయంలో డీఎస్పీ పర్యటన



ఎంటీఆర్ సర్కిల్‌లో వివరాలను తెలుసుకుంటున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

మంత్రాలయం: మంత్రాలయంలో శుక్రవారం రాత్రి ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు పర్యటించారు. స్థానిక పోలీస్‌స్టేషన్, రాఘవేంద్ర సర్కిల్, ఎంటీ ఆర్ సర్కిల్, తుంగభద్ర నది సమీపంలో పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాలను పరిశీలించారు. అనంతరం సీసీ కెమెరాల పని తీరును గురించి అడిగి తెలుసుకున్నారు. రద్దీ సమయాల్లో పార్కింగ్ సమస్య ఉందని త్వరలోనే పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని డీఎస్పీ తెలిపారు. వసతి గృహాల్లో కూడా రికార్డులను సక్రమంగా పూర్తి వివరాలతో ఉండే విధంగా చూడాలన్నారు. ఆయన వెంట సీఐ రామంజులు, ఎస్ఐ పరమేష్‌నాయక్ తదితరులు ఉన్నారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న ఎన్ఎంయూఏ రాష్ట్ర కార్యదర్శి ఇస్మాయిల్

ఎమ్మిగనూరుటౌన్: ఉద్యోగుల ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఎన్ఎంయూఏ రాష్ట్ర కార్యదర్శి ఇస్మాయిల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని రాజేశ్వరీ లాడ్జ్ సమావేశ భవనంలో ఏపీఎస్ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈహెచ్ఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత అపరిమిత వైద్య సేవల విధానాన్ని కొనసాగించాలని కోరారు. కొత్త బస్సులను కొనుగోలు చేయాలని, డిపోల్లో మెకానిక్‌లకు శిక్షణ ఇవ్వాలన్నారు. సమావేశంలో ఆ సంఘ నాయకులు మద్దిలేటి, ఎన్‌పీఎం సాహెబ్, ఎస్ఎం రఫి, ముస్తాక్ అహమ్మద్, భాస్కర్, నవాజ్, మదార్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా, కర్షక వ్యతిరేక విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న రైతు సంఘ నాయకుడు పంపన్న గౌడ్

ఎమ్మిగనూరుటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా, కర్షక వ్యతిరేక విధానాలపై పోరాటం చేసేందుకు అందరూ సిద్ధం కావాలని రైతు సంఘ నాయకుడు పంపన్న గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 26వ తేదీన ఆదోనిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కర్షక వ్యతిరేక విధానాలపై రైతు సంఘం, ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయుల ఆధ్వర్యంలో జరిగే భారీ ర్యాలీ, సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలి



శిక్షణ పొందిన ఏఓ, ఏఈఓలతో డీఏఓ వరలక్ష్మి

పత్తికొండ(తుగ్గలి) : రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారిణి పి.వరలక్ష్మి సూచించారు. పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువుల నాణ్యతపై ఏఓ, ఏఈఓలకు రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. మాస్టర్ ట్రైనర్ వేదానందం, రామాంజనేయులు, అనంతపురం ఎఫ్‌సీవోలు సరస్వతి, జ్ఞానేంద్రముని శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన ఏఈఓలకు డీఏఓ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏడీఏ మోహన్ విజయ్, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.